# జనరంజకములైన దేశీరూపకాలు

నాగభూషణ్ – పద్మజాభూషణ్

వీధినాటకాలని, జననాటకాలని, జానపద నాటకాలని, గ్రామీణ నాటకాలని, లోకధర్మ నాటకాలని – వేరు వేరు పేర్లతో ప్రచారంలో ఉన్న అన్ని నాటకాలను 'దేశిరూపకాలు' – అన్న పేరుతో వ్యవహరించవచ్చు. నాగరకుల మార్గ నాటకాలకు భిన్నమైన విధంగా జానపదులకు అందుబాటులో వుండి, వారిని రంజింపచేయడానికి ప్రయుక్తం చేయబడే ముఖ్యమైన రూపక ప్రక్రియ దేశీరూపకం.

మార్గరూపకాలు సంస్కృత భాషలో వ్రాయబడి పండితులకే పరిమితమై వుండడం, విద్యావంతులైన ఉన్నత కులాలవారినే అవి రంజింపచేయడం వల్ల గ్రామీణ ప్రజలు అర్థం చేసుకోగల దేశీభాషలో వారి వినోదం కోసం వ్రాయబడినవే యీ రూపకాలు. ప్రజాజీవితంలో ప్రతి క్రియా యీ రూపకాలకు ప్రాతిపదిక. వారి ఆచార వ్యవహారాలను ప్రస్ఫుటంగా ప్రతిబింబించే మనోరంజకమైన ప్రక్రియ యిది.

ఈ దేశీరూపకాల ఉత్పత్తి, ఏలా ఎప్పుడు జరిగిందో నిస్పష్టంగా చెప్పడానికి మనకు ఆధారాలు లేవు. కాని మానవుడు సహజంగా అనుకరణశీలి, ఆ అనుకరణం భాషలోను, వేషంలోను చేయసమకట్టిన నాడే తొలిరూపక ప్రయోగానికి నాంది ప్రారంభించబడ్డది. అయితే ఆనాటి నుంచి నేటి రూపకముల ప్రగతిదశకు చేరుకోవడంలో అది ఎన్నో స్థితిగతులను గడించిందని మాత్రం చెప్పగలం.

ప్రపంచంలోని ఏ దేశానికి చెందిన నాటకం చరిత్ర గమనించినా ప్రస్ఫుటం అయ్యే సత్యం ఒక్కటే. అన్ని దేశాలలోని రూపకాల ఆవిర్భావానికి, మతంతో ఎంతో కొంత సంబంధం వుంది. ఆ మతాలకు సంబంధించిన వూరేగింపులో, ఉత్సవాలలో మానవుడు ఆనందంతో వేసినచిందు మొదటి నృత్య విన్యాసం.

రామదాసు అది సంగీతమును, సంభాషణలను కూర్చుకుని దేశీరూపకం అయింది. మానవుడి తాముగా వేషం కట్టడానికి ముందు, బొమ్మలతో ఆటలు ఆడేవారని ఆ బొమ్మలాటకు ప్రగతి రూపమే నాటకమని మనం నమ్మవచ్చు. అంతే గాక ఈ పరిణామ చరిత్రను గమనిస్తే మరో విషయం కూడా విశదం అవుతుంది. ఈ నృత్యం మొదలయిన తొలిరోజులలో పురాణ పఠనం, హరికథాగానం, భాగవత కాలక్షేపం వంటి గాన రూపంలో జరిగిన కథాఖ్యానాలు కూడా బయలు దేరాయి. ఇట్టి కథాభ్యాసం రామాయణం కాలంనాటికే వున్నదని, కుశలవులు చేసని రామాయణ గానం అట్టిదేని చెప్పినా తప్పుకాదు. ఇది ప్రాథమిక రూపమేగావచ్చు. కాగా ఈ కథాఖ్యానాలకు, వెనుకటి ఉత్సవాలలోని నృత్యాలకు మతసంబంధమైన సామ్యం ఉండడం వల్ల అవి రెండూ ఒక్కటై దేశీరూపకాలలోని ప్రాథమిక దశను రూపొందించాయని అనుకోవచ్చు. ఇది బహుశః బహు పురాతనమైన కాలంలోనే జరగివుండవచ్చు. ఎందువల్ల నంటే క్రీ.పూ. 140కు చెందిన పతంజలి మూడురకాలైన జననాట్యాలని పేర్కొన్నట్లు తెలుస్తున్నది. ఇందులో మొదటిది: సోభిక అనే మూక నృత్యం. రెండవది: చైత్రిక అనే చిత్రించబడిన బొమ్మల ద్వారా ప్రదర్శింపబడేది. మూడవది: గ్రంథిక పుస్తకాలలోనుంచి చూచి పఠించే పద్ధతి.......దేశీరూపకాల తరువాత రూపానికి, వీనికి జనకజన్య సంబంధం ఉందని విదితం అవుతుంది.

వివిధ దేశాల నాటక చరిత్రను పరిశీలిస్తే నాటక పరిణామం – దేశీరూపకాలలోవలెనే మూడు దశల్లో సాగిందని చెప్పవచ్చు. అందులో ప్రాథమిక దశ అని మనం చెప్పుకున్న ఏకపాత్రాభినయాత్మకం, పురాణ కాలక్షేపం – మొదటి దశ కావచ్చు. దానికే రెండవదశ హరికథాకాలక్షేపం, దానికి విభిన్న రూపాలు, జంగం కత, జముకుల కథ – ఇత్యాదులు.

గ్రీసు దేశంలో అంతకుముందు కేవలం బృందనృత్యంగా వున్నదశలో 'ఎస్కిలస్' మొదటి నటుణ్ణి 'సోఫోక్లిస్' ఇద్దరు నటుల్ని ప్రవేశపెట్టి నాటకత్వాన్ని పరిపూర్ణం చేశారంటారు. అలానే భారత దేశ రూపకాలలో కూడా ప్రథమదశ ఏకపాత్రాభినయాత్మకం అని చెప్పుకోవచ్చు. ఇలా అనుకోడానికి మరికొన్ని కారణాలు కూడా వున్నాయి. ఇప్పటికీ ప్రచారంలో ఉన్న కొన్ని దేశీరూపకాలు ఏకపాత్రాత్మకములే, హరికథను గూర్చి, పురాణాభ్యాసాలను గూర్చి ఇప్పుడే చెప్పబడ్డది. ఇవిగాక మహారాష్ట్రంలోని 'బహురూపి' అనే జననాట్యంలో ఒకే వ్యక్తి వేరువేరు వేషములు ధరించి జనులను ఆనందపరుస్తారు. కేరళ దేశానికి చెందిన 'ప్రబంధకుత్తు' అనే దేశీనాట్యంలో ఒకే అభినేత కథకు వ్యాఖ్య చెబుతూ దానిని ప్రదర్శన పూర్వకంగా చూపుతాడు.

ఇక రెండవ దశలో ఇద్దరు పాత్రలు కల నాట్యం ప్రాముఖ్యంలోకి వచ్చింది. వీనిని యుగ్మనాటకాలు అనవచ్చు. జంగంకథ, జముకుల కత – మొదలైనవి యీ దశలో ప్రాథమిక రూపాలు. 10వ శతాబ్దానికి చెందిన 'త్రై విక్రమ' అనే జననాట్యం. ఇద్దరు పాత్రలతో కూడినది. దానిలో సూత్రధారుడు, నటి ఒక చిత్రపటాన్ని వుంచుకుని దానిని గురించి కథను అభివర్ణిస్తూ వుంటారు. 'గ్రంథిక' అనే జననాట్యంలో రెండు దళాలు వేరు వేరు సంభాషణలు చదువుతూ అభినయం చేస్తారు. 'ఖ్యాక్' లేక 'ల్యావని' అనే ఆఖ్యానం కూడా ఇట్టిదే. ఇందులో ఇద్దరు వ్యక్తులు ఏదో ఒక విషయాన్ని ఆధారంగా తీసుకుని ఆశుకవిత్వం చెబుతారు. బెంగాలులో రెండు దళాలవారు పాల్గొనే 'కది' అన్న జననాట్యం ఇట్టిదే. గొల్లకలాపంలో చాలా వరకు యిద్దరు పాత్రలే ప్రధానములు. ఇవన్నీ రెండవదశకు చెందినవని చెప్పుకోవచ్చు.

ఇంక మూడవదశలో అంటే నేటి పరిణతి దశలో చేర్చదగిన సమూహ నాట్యములు. వనినే దేశిరూపకాలు అంటున్నాం. ఇవి ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క విశిష్ట రూపక ప్రక్రియగా మారి ఆ ప్రాంతానికి చెందిన కొన్ని ప్రత్యేకతలను సంతరించుకుని రూపొందించుకుని నేటికి ప్రాంత ప్రజలకి మనోల్లాస కారణం అవుతున్నాయి.

ఈ విధంగా పరిణామం చెందిన దేశీరూపకాల ప్రాచీనతని గురించి తగినన్ని ఆధారాలు లేవు. కాని క్రీ.పూ. నుంచి కూడా యిట్టి రూపకాలున్నాయని వెనుకనే గమనించాం. భరతుని కాలంలోకూడా జననాట్యములు వున్నాయిని కృష్ణమాచారి అభిప్రాయం.

సంగీతం నాటకములైన స్వాంగ నాటకముల గూర్చి కాళిదాస విరచితములైన 'మాళవికాగ్నిమిత్రం'లో చెప్పబడ్డది. ఈ స్వాంగ నాటకాలు క్రీ.పూ. రెండవ శతాబ్దం నుంచి ప్రదర్శింపబడుతున్నట్లు ప్రతీతి. నాల్గవ శతాబ్దంలో 'కీర్తనియ' అన్న పేరుతో ప్రచలితం అయిన అస్సాం వారి జననాట్యం, 'గోందార్' అన్న మహారాష్ట్ర జననాట్యం, మాలవారి దేశానికి చెందిన 'కుతు' అనే నాట్యం, వెయ్యి సంవత్సరములకు పూర్వపు నాటివని చెప్పబడుతోంది. అంటే, ఈ దేశిరూపకం దాదాపు రెండువేల సంవత్సరముల నుండి అవిచ్ఛిన్నంగా, గ్రామీణ ప్రజాజీవితంలో ఒక భాగస్వామిని అయి, వారికి మనోరంజకాన్ని కలిగిస్తున్న రూపక ప్రక్రియ అన్నమాట.

ఈ రూపకం ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క రకంగా ఉంటుంది. అలాగే ప్రత్యేకత సంతరించుకుంది. పరిశీలించడం ఈ వ్యాసాల లక్ష్యం. అంతకుముందు ఈ దేశీరూపకాలు అన్నింటికీ వర్తించే కొన్ని సామాన్య

లక్షణాలు వున్నాయి. వానిని గురించి తెలుసుకోవడం ఆవశ్యకం.

మార్గదర్శకాలకు భిన్నంగా ప్రజాసామాన్యానికి అందుబాటులో ఉండి, వారిని రంజింపచేయడానికి ప్రయుక్తం చేయబడే రూపకాలు దేశిరూపకాలని వెనుక చెప్పుకున్నాం. వీనికి, మతానికి మొదట మొదట వున్న సంబంధాన్ని కూడా చూశాం. ఈ మత సంబంధమైన ప్రాముఖ్యం దేశీరూపకాలలో ఇటీవలి వరకు నిలిచే వుంటుంది. భక్తిగాథలు ప్రజలకు అందించడానికి వివిధ సాహిత్యాంగాలు చేసిన కృషిలో అగ్రతాంబూలం దేశీరూపకాలకే.

అందువల్లనే రామలీల వంటి దేశీరూపక ప్రక్రియలు నేటికీ మతసంబంధమై యున్నాయి. అన్ని భాషల దేశీరూపకాలలోను ప్రాథమిక రూపంలో పౌరాణిక భక్తిగాథలే కథావస్తువులుగా వుండేవి. రానురాను ప్రజల మనోభావాలను వ్యక్తీకరించడానికి, సంఘంలో జరిగే కుళ్ళును విమర్శించడానికి గాను యీ రూపకాల మధ్యలో హాస్యప్రసంగాలు, తరువాత తరువాత సంప్రదాయ హాస్యపాత్రలు ప్రవేశపెట్టబడ్డాయి. ఈ సంప్రదాయం బొమ్మలాటల నుంచి గ్రహించినవై వుండవచ్చు. ఈ హాస్యపాత్రల ద్వారా ప్రజల మనోభావాలు వ్యక్తీకరించబడడమే కాక వారి ఆచార వ్యవహారాలను కూడా ప్రదర్శింపబడేవి. కొంతకాలం తరువాత ఈ హాస్య ప్రసంగాలు మాత్రమే హ్రస్వ ప్రహసనాలుగా ప్రదర్శింపబడడం కూడా దేశంలో అక్కడ ఆచారం ఉంది.

అందువల్ల యిటీవలి ప్రచారంలో ఉన్న దేశిరూపకాలు స్థూలంగా రెండు రకాలుగా ఉన్నాయిన చెప్పుకోవచ్చు. అందులో ఒక రకం లఘుప్రహసనాలు. ఇవి కేవలం తాత్కాలికేతివృత్తం కలిగినవి. ఈయా ప్రాంతాల ప్రజల వేషభూషలకి, ఆచార వ్యవహారాలకి అనుగుణంగా సాగినవి. ఈ ప్రహసనాలు సాంఘిక విమర్శలోను, కొందరు కొందరు వ్యక్తుల అనుసరించడం ద్వారాను, ఆయా ప్రాంతాల ప్రజలకు హాస్యాన్ని అందిస్తాయి. అందువల్ల ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క రకంగా వీని రచన సాగుతుంది. సాధారణంగా సాంప్రదాయకంగా వచ్చే సంభాషణలు ఇందులో తక్కువ.

ఇక రెండవ తరహా రూకాలు నృత్య నాటకాలు కథలు ధార్మికమైనవి, పౌరాణికములు, లేదా ఇతిహాసములు అయిన ఇతివృత్తాలు కలిగి సంగీతం, నాట్యం ప్రధానంగా ఉన్న రూపకాలు. ఇవి దేశిరూపకాలలో పరాకాష్టకు చెందినవి. మొదట్లో అన్నీ నీతిదాయికములుగా వుద్దేశింపబడినప్పటికీ రానురాను వానిని ప్రదర్శించడంలో కళాత్మకములుగా వుండడానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తూ వచ్చాయి. గ్రామీణ ప్రజలు దైవభక్తి పరులు గనుక, తరబడి ప్రయుక్తం చేయబడుతున్నా, వెనుకటి వుత్సాహంతోనే ప్రజలు వానికి చూస్తూ వున్నారు.

**ఇతివృత్తం**

దేశిరూపకాలలోని ఇతివృత్తాన్ని గురించి సూచన మాత్రంగా చెప్పుకున్నాం. ప్రహసనాలలోని కథ కేవలం ప్రాంతీయము, తాత్కాలికము. దాని ప్రధాన లక్ష్యం గ్రామీణ ప్రజలకు వినోదం కల్గించడం. ప్రజల అనుభూతులను దగ్గరగా వచ్చే సాంఘికమైన విమర్శనలతో కూడి వారి మనసులను రంజింపచేసే ప్రక్రియ ఇది.

ఈ రెండవ విధములైన కథా రూపకాలు ఐతిహాసికములుగాని, పౌరాణికములుగాని, అయివుంటాయి. పౌరాణికాలలో కూడా చాలా భాగం కృష్ణ భక్తిని ప్రదర్శించేవే. ఉత్తర దేశంలో కొన్ని దేశిరూపకాలు కేవలం కృష్ణభక్తిని చూపేవి. మరికొన్ని కేవలం రాములవారి మహాత్మ్యాన్ని చాటేవి. అప్పుడప్పుడు జానపద నాయకుల,

గొప్ప భక్తుల కథలు కూడా వీనికి యితివృత్తాలు కావడం..........................................................
..........................................చాల భాగం భక్తి ప్రధానాలు, మార్గరూపకాలలో వున్న జటిలత, సంక్లిష్టత యీ యితివృత్తాలలో ఎక్కడా కానరాదు. అసలు సేకరించే కథాభాగమే క్లుప్తమైనది. ఇతివృత్తం కన్న భక్తి భావం ముఖ్యం కనుక, కథ్యా, కథన చాతుర్యం కన్నా, నాట్యం, తద్వారా సామాన్య ప్రజలను రంజింపచేయడం ముఖ్యం కనుక, యీ ఇతివృత్తాలు సులభగ్రాహ్యాలుగా వుంటాయి. ఈ యితివృత్తాలు భక్తిభావాన్ని ప్రదర్శిస్తూ, దేవతలకూ వారి విరోధులకూ, అంటే మంచికీ చెడుకూ జరిగే సంఘర్షణలను చూపి, మంచి విజయం కలుగుతుందని నిరూపించి, తద్వారా పల్లెపల్లెలా శాంతిని స్థాపించి సాహిత్యానికి గల పరమ ప్రయోజనాన్ని అభ్యివ్యక్తీకరిస్తారు.

శృంగార ప్రధానములైన దేశిరూపకాలు కూడా లేకపోలేదు. అందులో స్వాంగమ, భనాయి, గిద్దీ – ముఖ్యమైనవి. భామాకలాపం కూడా అందులోనే చేరుతుంది. ఇందులో ప్రేమ ప్రధానమైనది.

**పాత్రలు – పాత్రపోషణ**

దేశిరూపకాలలోని పాత్రలలో పౌరాణిక ఐతిహాసికములైన పాత్రలను గురించి ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఆ పాత్రలన్నీ సాధ్యమైనంత వరకు ఆయా పురాణాలతోను, ఇతిహాసాలలోను వర్ణించినట్లుగానే కన్పిస్తారు. కాగా వానిలోని సాంప్రదాయక పాత్రలు, హాస్య పాత్రల విషయంలో రెండు ముఖ్యం విషయములు చెప్పవలసివుంది. వానిలోని సాంప్రదాయక పాత్రలు కూడా...................వుద్దేశింపబడి జ్ఞాపకం వుంచుకోవలసిన హాస్యపాత్రలు. వీనిలో సూత్రధారుడు వచ్చిన నటీనటులతో సంభాషణలు జరుపుతూ మధ్య మధ్య హాస్యప్రసంగాలు చేస్తాడు. అతడుగాక కొన్ని రూపకాలలో కొన్ని నిర్ణీతమైన హాస్యపాత్రలుండడం చాలా సాధారణంగా కనిపిస్తుంది. తోలుబొమ్మలాటలలో వలెనే యీ పాత్రలు కూడా ఆ ప్రాంతానికి చెందిన, ఏ పిసినారి వ్యాపారినో, దుష్టుడైన జమిందారునో విమర్శిస్తూ అనుకరిస్తూ హాస్యాన్ని పోషిస్తారు. ఈ విదూషకుని పాత్రరూపకం మొదలంటా వస్తూ నాయకీ నాయకులతో హాస్యప్రసంగాలు చేస్తూ వుంటాడు. ఇతడే మార్గ నాటకాలలోనికి కూడా ఎక్కి 'విదూషకుడిగా' ప్రసిద్ధి పొందాడని కూడా ఒక వాదం ఉంది. సూక్ష్మముల, నిశితములు అయిన వ్యాఖ్యానములు చేయడం దేశిరూపకాలలోని విదూషకుని పనికాదు. అతని సంభాషణలు మనకు కొంచెం ఎబ్బెట్టుగా తోచడం సహజం

ఒక పాత్ర పోషణ గురించి రెండు మాటలు. దీనిలో ఉత్తర దేశీయ రూపకాలు, దక్షిణ దేశీయ రూపకాలు భేదిస్తాయి. సాధారణంగా ఉత్తర దేశలో ఆడంబరమైన వేషధారణ కన్పట్టదు. కాని దక్షిణ దేశంలో ఆడంబరమైన వేషం ప్రధానము. ఇది ఒక్కటీ తప్పిస్తే అలంకరణలో మాత్రం అంతా సామాన్యమే. రంగురంగుల దుస్తులతోను, ప్రతిశీర్షములతోను అలంకరించుకొనేవారు.........................................................
..........................................పాత్రాభినయం చాలావరకు సాంప్రదాయ మార్గంలోనే నడుస్తుంది. అయితే, ఎంతో స్వతంత్రంగాను, సాఫీగాను మాత్రం వుంటుంది. మార్గనాటకాలలోని సూత్రాలకు కట్టుబడి చేయవలసినట్లయి యిచట నటన వుండనక్కరలేదు. ఏ పాత్రను అభినయించే నటుడు ఆ పాత్రను అర్థం చేసుకొని ప్రజల దృష్టిలో ఆ పాత్రకున్న ప్రత్యేకతను గుర్తుంచుకుని నటిస్తాడు. అందువల్ల ప్రతిపాత్ర కూడా ప్రజల మన్ననలకు పాత్రం అవుతుంది.

**భాష – సంభాషణలు**

జానపదులకు మాత్రమే ఉద్దేశింపబడిన యీ దేశి రూపకాలలో వారికి సహజమైన తేలిక భాష మాత్రమే ప్రయుక్తం చేయబడుతుంది. అయితే, యీ భాషను కూడా అలతి అలతి పదాలతో పద్యాలతోను, పాటలతోను కూర్చడం వల్ల అది ఇంకా ఎక్కువ ఆకర్షవంతంగా ఉంటుంది. ఈ దేశ రూపకాలలో గేయభాగం ఎక్కువగాను, గద్య భాగం తక్కువగాను ఉంటుంది. విదూషకుల హాస్యాత్మక సంభాషణలు మాత్రం తప్పనిసరి గద్యంలో ఉంటయి.

ఈ నృత్య, గాన ప్రధానములైన రూపకాలు భాషా లాలిత్యానికి మారు పేర్లు. ఒక్కొక్కప్పుడు వీనిలో ఏ మాత్రం, సాహిత్యపు విలువ ఏ మాత్రం లేకుండా, జుగుప్స జనించేలా కూడా ఉంటాయి.

**సంగీతము**

దేశీరూపకాలలో సంగీతం మూలం. వీనిని సంగీత నృత్య రూపకాలని పిలవడం కూడా కద్దు. ఈ సంగీతమంతా దేశీరాగములకు అనుగుణమైనదే. దేశి ఛందస్సులలో ప్రయుక్తములైన గేయములే స్వీకరించబడుతాయి.

ఇక వాద్యములు గూడ దేశ్యములే. డోలు, తాళము, చిప్పలు, గజ్జెలు, మురళి – మొదలైనవి సాధారణ వాద్యములు. వీని ప్రయోగమును గూర్చి దేశి రూపకముల ప్రయోగమును పరిశీలిద్దాం.

ఇక్కడ ఒక్క విషయం మాత్రం చెప్పకోవాలి. ఈ వాద్యాలన్నీ ఏ సమయానికి తగినట్లు అవి ప్రయోగింపబడేవి. భీకరమైన పాత్రల ప్రవేశ సమయంలో అందుకు తగినవి. నాయకీ నాయకుల ప్రవేశ సమయంలో తదనుగుణమైనవి ప్రయోగింపబడతాయి. ఒక్క సూత్రధారుని లేదా విదూషకుని (హాస్యగాని) గద్య సంభాషణలకు తప్పిస్తే మిగిలిన అన్ని వేళల వాద్య సంగీతామో, పదమో తప్పక ఉంటుంది. అందువల్ల నూటికి తొంబది పాళ్లు సంగీత–గీతికానృత్యములు వుంటాయని చెప్పవచ్చు.

హాస్యము

దేశిరూపకాలలో హాస్యము ప్రాణము. ఈ హాస్యమును సృష్టించడానికి గల సాంప్రదాయిక హాస్యపాత్రలను గురించి ముందుగానే పరిశీలించాము. భారతదేశంలో కొన్ని ప్రాంతాలలో........................................ ....................ప్రవేశించి, గ్రామస్థులకు కావలసినంత హాస్యాన్ని పంచిపెడతారు. ఒక్కొక్కప్పుడు కథకన్న, హాస్యముదే పైచేయి అన్న అతిశయోక్తి గాదు. ఈ హాస్య పాత్రలు, విదూషకుడు, నాటకంలో ఏ భాగంలోనైనా ప్రవేశించడానికి అర్హులు. ఏ పాత్రనైనా పలుకరించే స్వేచ్ఛ కలవారు. తమ సంభాషణల వలననేగాక, హావభావ చేష్టల వలన గూడ వారు ప్రజలను నవ్విస్తారు. కొన్ని రూపక ప్రక్రియలలో సూత్రధారులే హాస్య ప్రసంగములు చేయడం కూడా కన్పిస్తుంది. ఆ పాత్ర విదూషకుడి పనిని, సూత్రధారుని పనిని కూడా చేయడం మనకు కనిపిస్తుంది.

దేశిరూపకముల ప్రయోగము

దేశి రూపకాలను ప్రదర్శించడం ముందు ముందు 'ఆమెచూర్'గానే జరిగినా, రానురాను ఏవో కొన్ని కులాలవారు, లేదా కుటుంబాలవారు లేదా ప్రదేశాలవారు మాత్రమే ఒక్కొక్క ప్రక్రియను ప్రదర్శించాలనే నియమాలు వచ్చాయి. ఈ ప్రదర్శనలు ఊరూరా సంచారం చేస్తూ ప్రదర్శనలివ్వడం ప్రారంభించారు. అసలే గ్రామం. అందులో సంచార నటబృందం. ఈ రెండు కారణాలవల్ల రంగస్థల నిర్మాణం మీద, రంగాలంకరణ మీద యీ ప్రయోక్తలు ఏమాత్రము శ్రద్ధ వుంచనట్లు కానరాదు. పైగా గ్రామాలలో లెక్కకుమిక్కిలి ప్రేక్షకులు ప్రదర్శన చూడడానికి రావడం కూడా యిట్టి దానికి అభ్యంతరం అయివుండవచ్చు. కాగా యీ జానపద నాటకాలను ప్రదర్శించడానికి ఎట్టి నియమితమైన రంగస్థలము, దానికి కావలసిన లేదా మార్గ నాటకాలలో ప్రయోక్తం చేసే ఏ పరికరాలు కూడా అవసరం లేకుండానే నాటక ప్రదర్శనం జరుగుతుంది.

ఈ రూపకాల ప్రదర్శన రాత్రి 10గంటలకు ప్రారంభింపబడి తెల్లవారుజాము వేళకు ముగుస్తుంది. ఒక్కొక్కప్పుడు నాటకం రెండు మూడు రాత్రులలో ప్రదర్శింపబడుతుంది. ఏ మొగనో, ఏ దేవాలయం ముంగిటనో రెండు స్తంభాలు, దానికి రెండు ప్రక్కలా కాగడాల దీపాలు, లేదా ప్రమిదలతో దీపాలు, కళ్ళాపుచల్లి, రంగస్థలం ఏర్పాటు చేస్తారు. పందిరి వుంటే మంచిది. లేకున్నా ఇబ్బంది లేదు. కనుచూపుమేరకు అందేవరకు ప్రేక్షకుల గాలరీ. అటొకడు, ఇటొకడు ఒక తెల్లని గుడ్డను పట్టుకుంటారు. అది తెర. అది కూడా మొదటి నటీనటులు ప్రవేశించేవరకే. ఆ తరువాత అంకాలు, రంగాలు అన్నీ కూడా ఆ నటులు ఆ రంగస్థలం నుంచి వైదొలిగినంతనే పూర్తి అయ్యాయని భావించుకోవాలి. తెరవెనుక హంగుదారులు, వాద్యంగాంద్రు వుంటారు. ప్రతి పాత్ర ప్రవేశానికి ముందు తన చరిత్ర తాము చెప్పుకొని ప్రవేశించడం కొన్ని యెడల ఆచారం.

ఈ పై విషయాలను గమనిస్తే, గ్రామీణ ప్రజల వలెనే, వారికోసం ప్రదర్శింపబడే ఈ రూపకాలు కూడా ఎక్కువ ఆడంబరాలు లేక సామాన్య ప్రజలకు భక్తి ప్రపత్తులను కలిగిస్తూ తద్వారా తమ సమస్యలకు ఉల్లాసాన్ని కలిగిస్తాయి.......................భారతదేశంలో ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క దేశి రూపక ప్రక్రియ ప్రదర్శింపబడుతూ వుంటుంది. అట్టి వివిధ దేశిరూపకాలను గురించి తెలుసుకోవడం అత్యావశ్యకం.